
MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 237 | మంగళవారం 17 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# వెలుగులోకి సంచలన విషయాలు

## వెయ్యి మంది ఫోన్లు ట్యాపింగ్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నేతలపై ప్రధానంగా ఫోకస్

అక్రమంలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఫోన్లను సైతం ట్యాప్

ప్రతి అంశం నాటి ఏపీ సీఎం, ఆమె సోదరుడు వైఎస్ జగన్‌కు చేరవేసినట్లు సమాచారం.

సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం.

మావోయిస్టుల పేరుతో అధికార, ప్రతిపక్ష, వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లను కూడా ట్యాప్

రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లను ప్రభాకర్ రావు ఇచ్చినట్లు తేలింది.

## ఇది హేయమైన చర్య.. కేటీఆర్ సిగ్గుతో తలదించుకో



- ఏ రాజకీయ నేత, పార్టీ ఉండకూడదని.. తామే శాశ్వతంగా ఉండలనే చెడు ఆలోచనతో ఫోన్ ట్యాపింగ్‌కు తెరలేపారు.
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- తమ మూమెంట్స్ అన్ని కూడా ట్రాక్ చేశారు.
- కాంగ్రెస్ పార్టీకి చెందిన వందలాది మంది నాయకుల ఫోన్లను చట్టానికి వ్యతిరేకంగా ట్యాప్ చేశారు.

## సభ్యసమాజం సిగ్గుపడేలా కుప్పంలో మహిళపై దాష్టీకం

(అంకుశం, విశాఖపట్నం, జూన్ 17):

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసించడం సభ్య సమాజం సిగ్గుపడే ఘటన అని వైయస్ఆర్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మండిపడ్డారు. విశాఖపట్నం నగర పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు కనీస రక్షణ కూడా లేదనేందుకు ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. ఈ సంఘటనలో - మిగతా2లో



## ఎక్కడ చూసినా 'యోగా' జపం

నెల రోజులుగా శ్రమిస్తున్న అధికారులు

ప్రధాని హాజరయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వం తీవ్ర కృషి

సమీక్షలతో అధికారులు, ప్రజాప్రతినిధులు బిజీబిజీ



(అంకుశం, విశాఖపట్నం, జూన్ 17):

విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించనున్న యోగా కార్యక్రమానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు నెల రోజులుగా తీవ్ర కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే యోగాంధ్ర వేడుకలపై విశాఖలోని వీఎంఆర్డీ కార్యాలయంలో మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, డిబివి స్వామి, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్య ప్రసాద్, ఎంపీ భరత్‌తో పాటు పలువురు కూటమి ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. 11 అంతర్జాతీయ యోగా - మిగతా2లో

## విశాఖలో ట్రాఫిక్ ఆంక్షలు

సీపీ శంఖబ్రత బాగ్చి

(అంకుశం, విశాఖపట్నం, జూన్ 17):

విశాఖపట్నంలో ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు సీపీ శంఖబ్రత బాగ్చి తెలిపారు. జూన్ 17 నుండి 21 వరకు ఆర్కే బీచ్ లో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పార్క్ హెూటల్ వరకు వాహనాలు నిషేధించారు. జూన్ 19 నుంచి 21 వరకు పార్క్ హెూటల్ నుంచి భీమిలి బీచ్ వరకూ బీచ్ రోడ్డుపై సాధారణ వాహనాలకు అనుమతి ఉండదన్నారు.



## జాతీయ స్థాయికి మించి ఏపీ తలసరి ఆదాయం

- 2024-25కు జాతీయ స్థాయిలో సరాసరి తలసరి ఆదాయం 8.7 శాతం
- ఏపీ ఆదాయం 11.89 శాతం నమోదు
- తలసరి ఆదాయం, జీఎస్డీపీ, రాష్ట్ర ఆదాయాలు ఎలా పెరుగుతాయనే అంశంపై అధికారులు అంచనాలు రూపొందించాలి
- రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించాలంటే ఏం చేయాలనే




అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ప్రణాళిక శాఖపై రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఎస్ విజయానంద్, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఏపీ ఎకానమీ, గ్రోత్ డ్రైవర్స్, జీఎస్డీపీ ప్రొజెక్షన్స్, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్లపై సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయికి మించి ఏపీ తలసరి ఆదాయం పెరిగిందని అధికారులు వెల్లడించారు. 2024-25కు జాతీయ స్థాయిలో సరాసరి తలసరి ఆదాయం 8.7 శాతంగా ఉంటే.. ఏపీ ఆదాయం 11.89 శాతం నమోదు చేసిందని అధికారులు సీఎం చంద్రబాబుకి వివరించారు. తలసరి ఆదాయం, జీఎస్డీపీ, రాష్ట్ర ఆదాయాలు ఎలా పెరుగుతాయనే అంశం పై అధికారులు అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రం - మిగతా3లో

## పునర్విభజనకు లైన్ క్లియర్!

ఏపీలో 225 నియోజకవర్గాలు

తెలంగాణలో 119 నుంచి 134కు పెంపు




అమరావతి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్థానాలు 175 నుంచి 225కు.. తెలంగాణ శాసనసభ స్థానాలు 119 నుంచి 134కు పెంపునకు మార్గం సుగమమైంది. దేశంలో జన గణన - మిగతా3లో

## మహిళపై పచ్చ సైకోల అరాచకం



- కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై వైఎస్ జగన్ ఫైర్
- రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ఇది నిదర్శనం
- 'మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా?.

తాడేపల్లి

చంద్రబాబు సొంత నియోజకవర్గంలో మహిళపై పచ్చ సైకోల అరాచకంపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు.. రాష్ట్రంలో మహిళలకు మీరు కల్పిస్తున్న రక్షణ ఇదేనా? అంటూ ప్రశ్నించారు. కుప్పంలో మహిళను చెట్టుకు కట్టేసిన ఘటనపై వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు ఇది నిదర్శనం అంటూ ధ్వజమెత్తారు.. 'మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా?. సాక్షాత్తూ మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నారాయణపురం గ్రామంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసిస్తున్న ఘటన, మీ దుర్మార్గపు పరిపాలన ఫలితమే. తిమ్మరాయప్ప అనే కూలీ అప్పు చెల్లించలేదనే కారణంతో అతని భార్య శిరీషను మీ పార్టీ కార్యకర్త చెట్టుకు కట్టేసి, హింసించాడు. ఆమె బిడ్డలు రోదిస్తున్నా సరే కనికరం చూపలేదు, విడిచిపెట్టలేదు. చంద్రబాబు..., మీ హయాంలో జరిగిన అనేక క్రూరమైన ఘటనల్లో ఇదొకటి. పొలిటికల్ గవర్నెన్స్, - మిగతా3లో

# టీడీపీకి కోవర్టుగా వాసుపల్లి

**విశాఖపట్టణం :** మాజీ ఎమ్మెల్యే కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయా? ఆయన మాటలు ఇప్పుడే ఎందుకు తేడాగా వినిపిస్తున్నాయి? మామీద మీ పెత్తనం ఏంటి? ఎక్కువ చేస్తే? పార్టీ ఆఫీస్ మెట్లు కూడా ఎక్కబోమని ఎందుకు అంటున్నారు? చచ్చేదాకా వైసీపీలోనే ఉంటానని ఒకవైపు చెబుతూనే? మరోవైపు స్వరం మారుస్తున్న ఆ మాజీ ఎవరు? ఆయనకు వచ్చిన ఇబ్బంది ఏంటి? ఉత్తరాంధ్ర వైసీపీలో ఒక్కొక్కటిగా అసమ్మతి స్వరాలు పెరుగుతున్నాయా అంటే? అవును, అలాగే కనిపిస్తోందంటున్నారు పొలిటికల్ పండిట్స్. అందుకు తాజా ఉదాహరణగా? విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ని చూపిస్తున్నారు. అంతకు ముందు సంగతి ఎలా ఉన్నా?. ఇటీవల వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ వేదికగా ఆయన అన్న మాటలు, లేవనెత్తిన ప్రశ్నలు చర్చనీయాంశం అవుతున్నాయి. ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వ్యవస్థ పార్టీ అధినేతకు, తమకు మధ్య అడ్డుగోడగా మారిందన్న మాటల చుట్టూ రకరకాల విశ్లేషణలు పెరుగుతున్నాయి. గతంలో ఆ పోస్ట్‌లో ఉన్న విజయసాయిరెడ్డి చర్యలవల్ల ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10వేల ఓట్లు కోల్పోయామన్న రాజకీయ సూత్రీకరణను తెరపైకి తెచ్చారు వాసుపల్లి. అలాంటి వ్యవస్థ ఇప్పటికీ అవసరమా?? అన్న అభిప్రాయంతో?. ప్రస్తుత కో ఆర్డినేటర్ కన్నబాబును కోట్ చేస్తూ? మాట్లాడ్డాన్ని కాస్త తేడాగానే చూస్తున్నాయట వైసీపీ వర్గాలు. ఇప్పుడు కూడా పాత పద్ధతులనే కొనసాగిస్తామని చెబితే? పార్టీ ఆఫీసులోకి కూడా అడుగు పెట్టబోనంటూ?. తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు మాజీ ఎమ్మెల్యే. దీంతో వాసుపల్లి ఆలోచన ధోరణి వైసీపీ లో విస్తృత చర్చ జరుగుతోందట. ఓవైపు కూటమి ప్రభుత్వం ఏడాది వైఫల్యాలపై పోరాటానికి సమాయత్తం అవుతున్న టైంలో?. వాసుపల్లి లాంటి వాళ్ళు పాత చేదు జ్ఞాపకాలతోనే సహవాసం చేయడం ఏంటని మాట్లాడుకుంటున్నాయట పార్టీ వర్గాలు. ఇక్కడ టీడీపీతో పోలిక తీసుకురావడం మరింత ఇబ్బంది మారిందట వైసీపీ నాయకత్వానికి. వాసుపల్లి గణేష్ రాజకీయంగా ఎదిగింది, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచింది టీడీపీలోనే. 2014, 2019లో విశాఖ దక్షిణ స్థానం నుంచి గెలిచారాయన. ఆ సమయంలో నేరుగా చంద్రబాబుతో మాట్లాడే అవకాశం ఉండేదని?కానీ? వైసీపీ అధికారంలో ఉన్నా?ప్రతిపక్షం లో కూర్చున్నా?. నియోజకవర్గ సమస్యల గురించి పార్టీ అధ్యక్షుడు జగన్‌కు నేరుగా రిపోర్ట్ చేసే అవకాశం లేకుండా పోయిందని, అదే అతిపెద్ద సమస్య అంటున్నారట ఈ మాజీ.వాస్తవానికి 2024 ఎన్నికల ఫలితాలు మిగిలిన నియోజకర్గాలతో పోలిస్తే వాసుపల్లికి అతిపెద్ద షాక్. జనసేన పోటీ చేయడం, ప్రత్యర్థి వంశీకృష్ణ పొరుగు నియోజకవర్గం నుంచి రావడం, రెండు సార్లు గెలిచిన తన అనుభవం అన్నీ కలిసొచ్చి స్వల్ప మెజారిటీతో అయినా.. బయటపడతానని అనుకున్నారట ఆయనకానీ? ఆ అంచనాలను తల్లకిందులు చేస్తూ? ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ 64వేలకు పైగా మెజార్టీతో గెలవడం చూసి వాసుపల్లి నిజంగానే షాకయ్యారన్నది లోకల్ వాయిస్. ఆ తర్వాతనే ఆయన పార్టీలోని అత్యంత కీలకమైన వ్యవస్థని టార్గెట్ చేస్తూ మాట్లాడటం యాధృచ్ఛికం కాకపోవచ్చని అంచనా వేస్తున్నారు విశ్లేషకులు. 2019లో టీడీపీ నుంచి గెలిచి ఏడాది కాలానికే జెండా పీకేశారు ఈ మత్స్యకార నేత. వైసీపీ అధినాయకత్వం సాదరంగా స్వాగతించినప్పటికీ నియోజకవర్గ రాజకీయాలు కంట్లో నలుసుగా మారాయట. అప్పటి వైసీపీ నేత, బ్రాహ్మణ కార్పొరే షన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వర్సెస్ వాసుపల్లిగా వ్యవహారం నడిచేది. అప్పటి పార్టీ ముఖ్యనేత విజయ సాయిరెడ్డి ప్రమేయంతోనే తాను ఇబ్బంది పడాల్సి వచ్చిందన్న అభిప్రాయం ఆయనలో ఉందట. ఇక ఎన్నికలకు ముందు సుధాకర్ పార్టీ మారిపోయి దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ అయ్యారు. ఇక దక్షిణ నియోజకవర్గం వైసీపీలో తనకు ఇబ్బంది లేదనుకుంటున్న టైంలో చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో కలకలం రేపుతున్నాయి. ఇప్పుడు ఆయన స్వరం ఎందుకు మారిందన్న చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అధికారం మారిన వెంటనే ఆయన తిరిగి కూటమికి దగ్గరవుతారని అనుకున్నారు అంతా. గణేష్ కుమార్ మాత్రం ప్రాణం వున్నంత వరకు వైసీపీలోనేనని తేల్చేశారు. అలాంటప్పుడు ఈ అసంతృప్త స్వరం ఎందుకంటే? అందుకు వేరే బలమైన కారణాలున్నాయన్న విశ్లేషణలు నడుస్తున్నాయి. విశాఖ దక్షిణంలో బలపడేందుకు మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ కుటుంబం ప్రయత్నం చేస్తోందట. అలాగే? ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు కూడా యాక్టివేట్ అవుతున్నట్టు సమాచారం. వాళ్ళకు పార్టీలోని సీనియర్లు సహకరిస్తున్నారన్న అనుమానమే ఆయన అసహనానికి కారణం కావచ్చంటున్నారు. అందుకే కో ఆర్డినేటర్ వ్యవస్థను కూడా ప్రశ్నిస్తుండవచ్చన్నది ఓ వాదన. మొత్తం మీద వైసీపీలోని అత్యంత కీలకమైన వ్యవస్థ టార్గెట్‌గా వాసుపల్లి సంధించిన అసంతృప్తి అస్త్రం ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.



## విద్యా మిత్ర పాఠశాల కిట్
# పంపిణీలో ఎమ్మెల్యే పరిటాల సునీత






**గతంలో పబ్లిసిటీ పిచ్చి.. ఇప్పుడు ప్రభుత్వంపై నిందలు వేసే కుట్రలు**

**పిల్లలతో రాజకీయాలు చేయవద్దని హితవు పలికిన ఎమ్మెల్యే సునీత**

**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 17:** పిల్లల చదువులతో కూడా రాజకీయాలు చేసిన ఒక సైకో లాంటి వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు చేశారు. రాప్తాడులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలనందు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పాఠశాల కిట్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, సరస్వతి దేవి విగ్రహాలకు పూలమాలలు వేశారు అనంతరం తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు 15వేల రూపాయలు ఆర్థిక సాయం అందించిన నేపథ్యంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆ తర్వాత విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కానుకను అందజేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పాఠశాలంటే దేవాలయాలలాంటివని ఇక్కడ కూడా గత ఐదేళ్లలో రాజకీయాలు చేశారన్నారు. విద్యార్థులకు అందించే స్కూల్ బ్యాగులు, బెల్టు ఇతర వాటిపై జగన్మోహన్ రెడ్డి ఫోటోలు వేసుకొని పబ్లిసిటీ చేసుకున్నారన్నారు. కానీ ఇప్పుడు సర్వేపల్లి రాధాకృష్ణ వంటి మహనీయులు ఫోటోలతో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఇందులో ఎక్కడా నాణ్యత విషయంలో రాజీలేదన్నారు. రాప్తాడు మండలంలోనే సుమారు 3వేల మందికి విద్యా మిత్ర కిట్లు అందజేసినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 36లక్షల మందికి విద్యా మిత్ర కిట్లు అందజేసేందుకు 950కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. అలాగే తల్లికి వందనం కింద రాప్తాడు మండలంలో 5వేల మందికి 6 కోట్ల 50 లక్షల రూపాయలు అందిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 68లక్షల మందిని గుర్తించి 8వేల 8వందల కోట్లు మంజూరు చేశారన్నారు. తొలివిడత 55లక్షల మందికి 7వేల 2వందల కోట్ల వరకు విడుదల చేసినట్లు వివరించారు. పేదల విద్య విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు కూడా చక్కగా చదువుకోవాలని సూచించారు. అయితే వైసిపి నాయకులు గతంలో చదువుల విషయంలో కూడా రాజకీయాలు చేశారని ఇప్పుడు ఓడిపోయాక కూడా వారికి బుద్ధి రావడం లేదన్నారు. ఎక్కడైనా ఏదైనా చిన్న సంఘటన జరిగితే దానిపై రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఒక బాలికపై అత్యాచారం జరిగితే పదేపదే దాని గురించి ప్రస్తావిస్తూ.. వారిని మరింత కుంగతీస్తున్నారన్నారు. కనీసం పిల్లలను చదువులనైనా మీ రాజకీయాలకు దూరంగా ఉంచాలని ఎమ్మెల్యే సునీత వైసిపి నాయకులకు హితవు పలికారు....

## అనవసర రాద్ధాంతంతో వైసీపీ

**విజయవాడ :** ఇంటిలో తిరుగుతున్న ఫ్యాన్ కు బేరింగులు బాగుంటేనే దాని నుంచి నలుదిక్కులా గాలి వస్తుంది. శబ్ధం లేకుండా ఫ్యాన్ ఆహ్లాదాన్ని అందిస్తుంది. రాత్రి వేళ సుఖమయ నిద్రను అందిస్తుంది. ఫ్యాన్ లోని ఇతరత్రా పరికరాల కంటే బేరింగులే కీలక భూమిక పోషిస్తాయి. అలాంటి ఫ్యాన్ ను పట్టుకుని ఎన్నికల ప్రచారంలో వైసీపీ అదినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్యాన్ ఇంటిలో ఉండాలి.. టీడీపీ గుర్తు సైకిల్ ఇంటి బయట ఉండాలి, ఇక జనసేన గుర్తు గ్లాసు సింకులో ఉండాలంటూ రిథమిక్ డైలాగులు చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే ఇప్పుడు వైసీపీ పరిస్థితి చూస్తే? ఆ పార్టీ గుర్తు ఫ్యాన్ కే బేరింగులు పూర్తిగా పాడైపోయాయని చెప్పక తప్పదు.ఇక అసలు విషయంలోకి వస్తే? జగన్ అమలు చేసిన అమ్మ ఒడి మాదిరిగానే కూటమి సర్కారు ఇటీవలే తల్లికి వందనం పేరిట కార్యక్రమాన్ని ప్రారంబించింది. ఈ పథకంపై ఆది నుంచి కూడా తనదైన శైలి విమర్శలు గుప్పిస్తూ వస్తున్న వైసీపి ఎక్కడికక్కడ కూటమి పార్టీలను ప్రత్యేకించి టీడీపీని ఎద్దేవా చేసేందుకు వైసీపీ నేతలు చేయని యత్నం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ విమర్శలన్నింటినీ తట్టుకుని మరీ కూటమి సర్కారు తల్లికి వందనాన్ని ఘనంగా ప్రారంభించింది. ముందుగా చెప్పినట్టుగా ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్న కూటమి మాట తప్పలేదు. ఫలితంగా ఒక్కో ఇంటిలో ఐదుగురు, ఆరుగురు, కొన్ని కుటుంబాల్లో అయితే ఏకంగా 12 మంది పిల్లలకూ ఈ పథకం అందింది.అయితే పథకం ప్రారంభం అయిన వెంటనే ఈ పథకం అమలు తీరుపై వైసీపీ తనదైన శైలి విమర్శలు గుప్పించడం మొదలు పెట్టింది. తల్లికి వందనం రూ.15 వేల అని చెప్పి రూ.13 వేలు మాత్రమే ఇచ్చారన్న వైసీపీ?మిగిలిన రూ.2 వేలు లోకేశ్ ట్యాక్స్ కింద లోకేశ్ ఖాతాలకు మళ్లాయని ఆరోపించింది. ఈ ఆరోపణలపై టీడీపీ చాలా వేగంగా రియాక్ట్ అయ్యింది. అమ్మ ఒడిలో మీరు కూడా రూ.2 వేలు కట్ చేశారు కదా..మరి నాడు జగన్ ఖాతాలోకి వెళ్లాయా? అని ప్రశ్నించిన టీడీపీ? లోకేశ్ ఖాతాలోకి రూ.2 వేలు చేరినట్లుగా నిరూపించాలని డిమాండ్ చేసింది. ఈ విషయంలో స్వయంగా లోకేశే రంగంలోకి దిగి డెడ్ లైన్ విధించడంతో వైసీపీ సైలెంట్ అయిపోయింది. సారీ చెప్పాలని లోకేశ్ హెచ్చరించినా ఏదో మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ మిన్నకుండిపోయింది.ఇక ఆదివారం ఉదయం నుంచి వైసీపీ ఈ పథకంలో బారీ ఎత్తున అవినీతి జరిగిందంటూ ఊదరగొట్టింది. ఒక తల్లికి 360 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ తల్లికి వందనం కింద డబ్బులు వేశారని, అలాగే చాలా మంది పేర్ల కింద 150, 100.. ఇలా ఇష్టారాజ్యంగా పిల్లల పేర్లు రాసుకుని టీడీపీ నేతలు ఈ పథకం డబ్బులను కాజేశారంటూ ప్రచారం మొదలెట్టింది. అయితే ఈ ఆరోపణలపైనా టీడీపీ మరింత వేగంగా రియాక్ట్ అయ్యింది. తల్లికి వందనం పథకాన్ని తాము అనాథ శరణాలయాల పిల్లలకూ అమలు చేస్తున్నామని చెప్పిన టీడీపీ? ఆ పెద్ద పెద్ద సంఖ్యలన్నీ రాష్ట్రంలోని ఆయా అనాథ శరణాలయాలకు చెందిన జాబితాలేనని తేల్చిచెప్పింది. అయినా ఏదో జాబితాల్లో దొరికింది కదా అని క్షేత్ర స్థాయి పరిశీలన లేకుండానే విమర్శలు చేస్తే ఇలానే ఉంటుంది మరీ.

## సభ్యసమాజం సిగ్గుపడేలా కుప్పంలో మహిళపై దాష్టీకం

-మొదటిపేజీ తరువాయి

బాధితురాలిని పరామర్శించే తీరిక కూడా ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ఇటువంటి దారుణానికి పాల్పడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇంకా ఆమె ఎమన్నారంటే.. కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో శిరీష అనే మహిళకు జరిగిన అన్యాయం మీద వైయస్సార్‌సీపీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తోంది. తప్పు చేసిన టీడీపీ కార్యకర్తలను తక్షణం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి. అప్పు తీర్చలేదనే కారణంతో మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం దారుణమైతే, సాక్షాత్తూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పంలో జరగడం దౌర్భాగ్యం. మహిళను అవమానించేలా ఇంత ఘోరమైన సంఘటన జరిగితే హోంమంత్రి అనిత వీడియో కాల్ లో పరామర్శించి చేతులు కడిగేసుకుంది. రాష్ట్రంలో మహిళల మీద వరుస అఘాయిత్యాలు, దాడులు జరుగుతుంటే ఈ ప్రభుత్వం చోద్యం చూస్తూ కూర్చుంది. మహిళ అయ్యుండీ హోంమంత్రి కనీస బాధ్యతగా నడుచుకోవడం లేదు. మహిళను నేరుగా వెళ్లి పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని, నిందితులను కఠినంగా శిక్షిస్తామని ధైర్యం చెప్పి రాకుండా వీడియో కాల్‌తో సరిపెట్టేసింది.

## ఎక్కడ చూసినా 'యోగా' జపం

-మొదటిపేజీ తరువాయి

దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించడం విశాఖ వాసుల అదష్టం. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఐదు లక్షల మందిని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆంధ్రప్రదేశ్ ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు వెలుతున్నాం. యోగ ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన ఒక గిఫ్ట్. యోగా జీవితంలో ఒక భాగం. 326 కంపార్ట్ మెంట్ లు సిద్ధం చేశాం. రెండు వేలు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరికి ఒక మ్యాట్,టీషర్ట్,ఓఆర్ ఎస్ బోటల్ ఇవ్వనున్నాం. వర్షం వస్తే, ఇబ్బంది లేకుండా ఏయూలో ఏర్పాటు చేస్తున్నాం. విశాఖవాసులు ప్రతీ ఒక్కరు పాల్గొవాలని మంత్రులు పిలుపునిచ్చారు.

## జాతీయ స్థాయికి మించి పెరిగిన ఏపీ తలసరి ఆదాయం

-మొదటిపేజీ తరువాయి

స్వయం సమృద్ధి సాధించాలంటే ఏం చేయాలనే అంశంపై డేటా అనలిటిక్స్ చేయాలని సూచించారు. సేవల రంగం అభివృద్ధి జరిగేలా దృష్టి పెడితే ఆర్థిక సుస్థిరతను సాధించగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గ్రామస్థాయిలో కూడా కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లు పెడితే.. క్షేత్రస్థాయిలో పోటీతత్వం పెరుగుతోందని సీఎం చంద్రబాబు చెప్పారు. 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు చేయడంతో పాటు.. పనితీరును మెరుగుపరుచుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

**స్వర్ణ ఆంధ్ర విజన్ చర్చ**

స్వర్ణ ఆంధ్ర విజన్ ఏ2047ని పకడ్బందీగా అమలు చేయడం కోసం సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ అమలు కోసం యంగ్ ప్రొఫెషనల్స్‌ను నియమించాలని సీఎం నిర్ణయించారు. 48 నెలల పాటు పనిచేయడానికి ప్రతి నియోజకవర్గానికి ఒక్కొక్కరి చొప్పున యంగ్ ప్రొఫెషనల్స్‌ని నియమించాలని అధికారులకు సూచించారు. ఏపీవ్యాప్తంగా 175 మంది యంగ్ ప్రొఫెషనల్స్ నియామకానికి అనుమతిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు.

**ఏపీలో ఇకపై ప్లాస్టిక్ రహిత నగరాలు: సీఎం చంద్రబాబు**

అలాగే.. సర్క్యులర్ ఎకనామి సమీక్షలో సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. ఏపీలో ఇకపై ప్లాస్టిక్ రహిత నగరాలు ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ లోగా ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, 4 ప్రధాన నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా అరికట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ నగరాల్లో క్లాత్ బ్యాగ్స్ వినియోగం పెంచాలని సూచించారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## పునర్విభజనకు లైన్ క్లియర్!

-మొదటిపేజీ తరువాయి

చేపట్టడానికి అనుమతిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. జనగణన వచ్చే ఏడాది పూర్తి కానుంది. కొత్త జనాభా లెక్కల ఆధారంగా దేశ వ్యాప్తంగా లోక్ సభ, శాసనసభ స్థానాల పునర్వి భజన ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టనుంది. రాజ్యాంగంలోని 170వ అధికర ణలోని సెక్షన్-15 ప్రకారం శాసనసభ స్థానాలను ఆంధ్ర ప్రదేశ్లో 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 134కు పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టా లని విభజన. చట్టం-2014లో సెక్షన్-26(1) ద్వారా ఎన్నికల సంఘానికి కేంద్రం నిర్దేశించింది.

## మహిళపై పచ్చ సైకోల అరాచకం

-మొదటిపేజీ తరువాయి

రెడ్‌బుక్ పేరిట మీరు నెలకొల్పిన దుష్ట సంప్రదాయంలో భాగంగా మీరు, మీ పార్టీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోయి చేస్తున్న దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు ఇలా ఎందరో బలైపోతున్నారు. ఈ ఘటనతోపాటు, ఏడాదికాలంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను సీరియస్‌గా తీసుకోవాలని, చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలి' అని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

## ఏడాది సంబురాల్లో కనిపించని కమలం

-మొదటిపేజీ తరువాయి

ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించలేదు. దీనివల్ల అనేకమంది మహిళలకు లబ్ధి జరుగుతోందని ఒక ప్రెస్ మీట్ గాని ఒక ప్రకటన గాని విడుదల చేయలేదు.అలాగే పింఛన్ల పెంపు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి వాటిపై కూటమి పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్న బిజెపి పక్షాన ఎవరు నోరు ఎత్తటం లేదు. మరి దీన్ని ఎలా చూడాలి? ఏ విధంగా అర్థం చేసుకోవాలి అంటే రేపు ఏదైనా ప్రజల్లో అసంతృప్తి రగిలి అసంతృప్తి కారణంగా విమర్శలు చేస్తే మా తప్పులేదు అని తప్పించుకునే దారి బిజెపిలో కనిపిస్తోందా? లేకపోతే రేపు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తే దానికి మాకు సంబంధం లేదు మేము నిమిత్త మాత్రులం అని తప్పించుకునే దారి కనిపిస్తోందా అంటే అవునని అంటున్నారు పరిశీలకులు.కూటమి ప్రభుత్వంలో ఏం చేసినా అది మూడు పార్టీలకు వర్తిస్తుంది. రేపు ఓట్లు అడిగే విధానాన్ని పరిశీలిస్తే మూడు పార్టీల పరంగానే ప్రజల్లోకి వెళ్లాలి. మూడు పార్టీల పరంగానే ప్రజలను ఓట్లు అభ్యర్థించాలి. ఈ విషయంలో బిజెపి నాయకులు అనుసరిస్తున్న ధోరణి ప్రధానంగా చర్చగా మారింది. ఇది సరికాదని ప్రజల్లోకి రావాలనేది కూటమి పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. నిజానికి గత ఎన్నికల్లో విజయం ఎలా ఉన్నా వచ్చే ఎన్నికల నాటికి ఈ ఐదేళ్ల పాలనను చూసి మాత్రమే ప్రజలు ఓటేస్తారు తప్ప జగన్ పై విమర్శలు చేయడం ద్వారా ఓట్లు ఎంతవరకు పడతాయి అనేది చూడాలి.కాబట్టి మళ్ళీ ఎన్నికల్లో విజయం దక్కించుకోవాలన్నా.. మళ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఓట్లు సాధించాలన్నా కూడా అందరూ కలిసికట్టుగా సంయుక్తంగా ప్రజల మధ్య ఉండడం ప్రజల సమస్యలు పట్టించుకోవడం ముఖ్యం. సంతృప్తిని కూడా అంచనా వేసుకోవడం వంటివి బిజెపి నాయకులు కూడా చేయాల్సిన అవసరం ఉందనేది పరిశీలకులు చెబుతున్న మాట. మరి కమల నాథులు ఏమంటారో చూడాలి.

## ఇప్పుడు కాకపోతే ఎప్పుడంటున్న జనసేన ఎమ్మెల్యేలు

**ఏలూరు :** 24 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని ఆధిపత్యాన్ని చూపించింది జనసేన. జిల్లాలోని ఆరు సీట్లలో పోటీ చేసి అన్ని చోట్ల విజయం సాధించి కంచుకోటగా నిలబడింది. అలాంటి జిల్లాలో పార్టీ అధినేత ఆశించిందొకటి.. ఎమ్మెల్యేలు చేస్తున్నదొకటి అన్నట్టుగా తయారైందట పరిస్థితి. ఇక్కడి

# నేను కూడా...
# పాత్రికేయ కుటుంబం నుంచే వచ్చా..

- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,
- : పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి
- : పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి
- : అనంతపురం ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ





**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 17 :** అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ వద్దనున్న ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య, బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ మరియు పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షఫీవుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో సుమారు 280 మంది పాత్రికేయుల పిల్లలకు ఈ ఏడాదికి విద్యకు సంబంధించిన విద్యా మెటీరియల్, నోటు పుస్తకాలు పెన్సిల్లు, ఇతర విద్యాసామాగ్రిని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ చేతుల మీదుగా అందజేశారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉరవకొండ హెచ్ఎంటీవీ పాత్రికేయుడు నాగరాజు మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు పూలమాలవేసి నివాళు లర్పించారు.

– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాత్రికేయుల పిల్లలకు అన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజు రాయితీ ఇచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ చేయడం పట్ల వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బాలాజీ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వారిని ప్రశంసించారు. ఇది చాలా మంచి కార్యక్రమం అని, మా నాన్నగారు కర్ణాటకలో ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి రిటైర్డ్ అయ్యారని, అంతకుముందు మా నాన్న కొద్ది రోజులు చిత్రదుర్గ జిల్లా రిపోర్టర్ గా పనిచేసేవారని, కొన్ని ఆర్టికల్స్ ప్రింట్ మీడియాకు చాలా ఆలోచించి, విశ్లేషించి రాసేవారని, ఆయన రాసే న్యూస్ గురించి ఇప్పుడు కూడా గుర్తు చేసుకుంటు ఉంటానని, నన్ను కూడా మీ కుటుంబ సభ్యుడిగా పరిగణించవచ్చన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రద్దు గురించి తెలియజేశారని, ఈ విషయమై లేఖ ఇచ్చిన రోజే సాయంత్రానికి ప్రొసీడింగ్స్ జారీ చేశామన్నారు. జర్నలిస్టుల గ్రీవెన్స్ ను పరిష్కరించేందుకు ఇన్చార్జిగా డిఐపిఆర్ఓ ఉంటారని, డిఐపిఆర్ఓ కార్యాలయానికి వారానికి ఒకరోజు ఒక లిఖితమైన సమయాన్ని ఇవ్వబడుతుందని, ఎలాంటి సమస్య ఉన్న లిఖితపూర్వకంగా తెలియజేయాలని, అనంతరం సమస్యలు తనకు తెలియజేయాలని, ఎంతవరకు సహాయం చేయగలుగుతామో ఖచ్చితంగా అంత సహాయం చేస్తామన్నారు. జర్నలిజం అనేది ఒక ఉత్తేజకరమైన వృత్తి అని, ఎంతో ఉత్సాహంతో ఒక జర్నలిస్ట్ వ్యాసం రాయడం మొదలు పెడతాడని, ఒక జర్నలిస్టు ఒక వ్యాసం రాయాలంటే కొన్ని రోజులు ఆలోచించి, దానికోసం తిరిగి, కొందరితో మాట్లాడి అన్ని రకాల వీక్షణతో వ్యాసం రాయడం జరుగుతుందని, వారిని ఒక ఆర్టిస్ట్ తో పోల్చవచ్చన్నారు. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, శాసనవ్యవస్థతో పాటు జర్నలిస్ట్ నాలుగవ స్తంభం అని అన్నారు. జిల్లా యంత్రాంగం అందరు జర్నలిస్టుకి గౌరవాన్ని ఇచ్చిందన్నారు. జర్నలిస్టుల అభిప్రాయాలు చాలా విలువైనవన్నారు. జర్నలిస్టులు రాసిన వ్యాసాలకు దీర్ఘకాళిక ప్రణాళికలు రూపొందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు మంచి చదువు దేవుడు అందించాలని కోరుకుంటు – న్నామన్నారు.

**పాత్రికేయుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట : పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**

– ఈ సందర్భంగా పాత్రికేయుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేశారని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ మరియు పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న విద్యారంగంతో పాటు అనేక కార్యక్రమాలను సమాజం దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా ఇటు విద్య అటు రాజకీయ పరంగా సహాయ సహకారాలు ఇస్తున్న మీడియా రంగానికి మా కుటుంబానికి ఎంతో మంచి అనుబంధ ఉందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అయితే పాత్రికేయ వృత్తిలో రాణిస్తున్న ఎంతోమంది పాత్రికేయులు ఎన్నో ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, అలాంటి వారి సమస్యల పరిష్కారానికి పల్లె కుటుంబం ఎల్లప్పుడూ తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. పాత్రికేయుల సమస్యలపైనే కాకుండా వారి సంక్షేమానికి నా వంతుగా అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పాత్రికేయుల పిల్లల ఉన్నత విద్యకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా పల్లె ఉమా ట్రస్ట్ ద్వారా పాత్రికేయుల సంక్షేమానికి ఈరోజు ఎంతో కొంత ఇవ్వడం గర్వకారణంగా ఉందన్నారు. మా మామయ్య ఈరోజు విద్యావేత్తగానే కాకుండా రాజకీయ నాయకుడిగా అత్యున్నస్థాయికి ఎదిగాడంటే అందుకు పాత్రికేయుల పాత్ర ఎంతో ఉందని వారి మేలు ఎన్నటికీ మరువలేనిదని పేర్కొన్నారు.

– ఈ సందర్భంగా ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ బాలకొండయ్య మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పారదర్శకంగా సమాచారం తెలియజేసే వారధన్నారు. వారి ఇచ్చే సమాచారం విశ్వసనీయత మీద ఉండాలని, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సహకారం జిల్లా యంత్రాంగానికి అవసరమన్నారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టబడి ఉందన్నారు.

– ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉరవకొండకు చెందిన హెచ్ఎంటీవీ పాత్రికేయుడు నాగరాజు పిల్లల చదువుకు అయ్యే ఖర్చును శ్రీ బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా భరించి చదివిస్తామని ఆ సంస్థ చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి వెల్లడించారు. పాత్రికేయులు వేరు కాదు మేము, మీరు వేరు కాదని, మనమందరం ఒక కుటుంబ సభ్యులేనని పేర్కొన్నారు. ప్రభుత్వానికి పాత్రికేయులు ఫ్రంట్ లైన్ వారియర్స్ గా సమాజ అభివృద్ధికి పాటుపడుతున్నారని కొనియాడారు. అన్ని రంగాలను సరైన దిశగా నడిపించే శక్తిగా పాత్రికేయ రంగానికి ఉందని గుర్తు చేశారు.

– అంతకుముందు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు షఫీ ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ, పాత్రికేయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. విద్యాసంస్థల్లో ఫీజు రైతుతోపాటు ప్రభుత్వం ఇచ్చే అక్రిడేషన్లు, ఇండ్ల స్థలాలు, ఇండ్ల నిర్మాణం తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు %ఒ% సీనియర్ పాత్రికేయులు ఆజాద్, రామాంజనేయులు, సంతోష్ రెడ్డి, పాత్రికేయ సభ్యులు 10టివి జగదీష్, అమర్, ప్రకాష్, ఆర్ కే టివి నాయుడు, కేశవ, రవి, దాదు, పలువురు పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించండి

విద్యాశాఖ విషయంలో మంత్రి నారా లోకేష్ కొత్త ఒరవడితో ముందుకు వెళ్తున్నారు

తల్లికి వందనం సంబరాల కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి

కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 17:** ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను తల్లిదండ్రులు చేర్చాలని అప్పుడే ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి చెందుతాయనిప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు సిఫార్సులు చేయించుకునే రోజులు త్వరలోనే చూస్తారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. తల్లికి వందనం పథకం ప్రారంభమైన నేపథ్యంలో నగరంలోని ఓల్డ్ టౌన్ లో ఉన్న ప్రభాకర్ పాఠశాలలో సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా పిల్లల చేత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆ తర్వాత థాంక్యూ సీఎం సర్, థాంక్యూ లోకేష్ సార్ అంటూ పిల్లలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకంతో ప్రతి ఒక్కరిలో ఆనందం కనిపిస్తోందన్నారు. తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా పిల్లల్ని పాఠశాలలకు పంపుతున్నారన్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థులు బడి మానేశారని ఇప్పుడు తిరిగి 12 లక్షల మంది బడికి వస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వస్తుందని.. ఇంకా కొంతమంది రానివారికి.. త్వరలోనే అందుతుందని స్పష్టం చేశారు. గతంలో ప్రతి విద్యార్థి నుంచి 2వేల రూపాయలు తీసుకొని ఏం చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం ఈ రెండు వేల రూపాయలు పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తున్నట్లు చెప్పారు. దీనికి తోడు పిల్లలకు ఇచ్చే బ్యాగుల మీద జగన్ ఫోటో ఉండటంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఒక అరాచకుడు, అవినీతిపరుడి ఫోటో చూస్తూ పిల్లలు చదువుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి కల్పించారన్నారు. కానీ ఇప్పుడు పిల్లల్లో స్ఫూర్తి నింపే విధంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల ఫోటోలతో పిల్లలకు విద్యా కానుకలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. మరోవైపు జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుంటే ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోననే ఆందోళన వైసీపీలో కనిపిస్తోందన్నారు. అందుకే వారు ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## యోగా ప్రతిరోజు చేస్తే ఆరోగ్యం

యోగా చేస్తే ఎంత ఆరోగ్యంగా ఉంటారో సీఎం చంద్రబాబు ప్రత్యక్ష నిదర్శనం

యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం వద్ద పార్క్ లో యోగా కార్యక్రమం

ఎమ్మెల్యే సునీత రాప్తాడు శాసనసభ్యురాలు





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 17:** ప్రతిరోజు యోగా చేస్తే ఎంత ఆరోగ్యంగా ఉంటారో చెప్పడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు నిలువెత్తు నిదర్శనమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు సమీపంలోని పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం సమీపంలోని పార్క్ లో ఏర్పాటు చేసిన యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలతో కలసి యోగా చేశారు. యోగా మాస్టర్స్ సూచించిన విధంగా ఆసనాలు వేస్తూ... అందరిలో స్ఫూర్తినింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ యోగా అనేది మనిషికి ఎంత అవసరమో అందరూ తెలుసుకోవాలన్నారు. ఒక మనిషి యోగా చేస్తే ఎంత ఉత్సాహంగా ఉంటారన్నది... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును చూస్తే తెలుస్తుందన్నారు. ఆయన ఏడుపదుల వయసు దాటినా కూడా యువకుడిలా పనిచేస్తున్నారన్నారు. ఆయనలో ఎప్పుడూ అలసట మేము చూడలేదని సునీత అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. గత నెల 21వ తేది నుంచి ఈనెల 21వ తేది వరకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారని. ఈనెల 21న వైజాగ్ లో 5లక్షల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమాన్ని నిర్వహించి వరల్డ్ రికార్డ్ సాధించేలా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోడీ కూడా పాల్గొంటున్నారని.. ఆరోజు నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యోగా అనేది అన్ని వయసుల వారికి చాలా అవసరమని.. యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. బీపీ షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా.. తగ్గే అవకాశం ఉందన్నారు అందుకే ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో యోగాను.. అలవాటుగా మార్చుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు....

## 10లక్షల 85వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన పరిటాల సునీత



**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 17:** రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు చెందిన పలువురికి ఎమ్మెల్యే పరిటాల సునీత సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో 10మంది లబ్ధిదారులకు 10లక్షల 85వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీతకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ పేదవాళ్లు అనారోగ్యానికి గురైతే... ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలుస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 2.50కోట్లకు పైగా ఇలాంటి సాయం అందిందన్నారు...

## ప్రధానమంత్రి గా నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలన పై ఇంటింటికి కరపత్రాలు పంపిణీ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 17:** బీజేపీ తోనే ఈ దేశంలో సంక్షేమం అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కొన సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండపేట లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలన కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో 98వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 సంవత్సరాల పాలన వికసిత్ భారత్ ప్రోగ్రామ్ ఇంచార్జ్ గూడవల్లి రాంబాబు అద్యక్షతన ఇంటింటికి కరపత్రాలు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కిసాన్ కార్యవర్గ సభ్యులు వల్లభనేని రవీంద్ర బాబు, చెరుకూరి గోపాల కృష్ణ, ఇంచార్జ్ లు చంద్రు బార్గవ్,ప్రదాన కార్యదర్శి జగతా రఘువీర్, పట్టణ బిజెపి మాజీ అద్యక్షులు మద్దుల సుబ్బారావు, బీజేపీ టౌన్ ఉపాధ్యక్షులు సందక వీరవెంకట సత్యనారాయణ, మల్లువలస రాజశేఖర్, నాయుడు రాంబాబు పాల్గొన్నారు.



## అనంత జిల్లాలో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలి

– జెసి పవన్ రెడ్డి వినతి



**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 17:** అనంతపురం జిల్లాలో విమానాశ్రయం స్థల ఏర్పాటు విషయమై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సమాలోచన జరుపుతున్న నేపథ్యంలో తాడిపత్రి పరిసర ప్రాంతాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల ప్రజలకు ప్రయోజన కారిగా ఉంటుందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని ఢిల్లీలోని ఆయన ఛాంబర్ లో కలిసి వివరించిన అనంతపురం టిడిపి నాయకులు జెసి పవన్ రెడ్డి ఇతర నాయకులు మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు భూసేకరణ చేసి తప్పకుండా విమానాశ్రయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు

# తల్లికి వందనం పై తప్పుడు ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలు

## దిగజారుడు ఆరోపణలు మానుకోవాలి-ఎమ్మెల్యే వేగుళ్ళ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 17:** ప్రతీ తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం అమలు చేస్తుంటే అది చూసి ఓర్వలేని జగన్ రెడ్డి & కో మాత్రం కల్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండిపడ్డారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంట్లో ఎంతమంది విధ్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. రూ.2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే రుజువు చెయ్యాలని సవాల్ చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయటమే వైసీపీ నేతల పని అని విమర్శించారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ హయాంలో అమ్మ ఒడి రూ.13 వేలు ఇచ్చారని అంటే రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్ కు చేరాయా? వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందన్నారు. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసిన విషయం వాస్తవం కాదా? చెప్పాలన్నారు. కాని ఇప్పుడు 67 లక్షల మంది విద్యార్థుల తల్లులకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం అన్నారు. ఇందు కోసం రూ.8,700 కోట్లు విడుదల చేయటం జరిగిందన్నారు. పాఠశాలలు తెరిచేలోగా పథకం అమలు చేస్తామని మాట ఇచ్చాం... దానిని నిలబెట్టుకున్నాం అన్నారు. ఇకనైన చౌకబారు ఆరోపణలు జగన్ రెడ్డి & కో మానుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ళ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాల దొర, అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు వై.ఆర్.కె. పరమహంస, రాయవరం మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి మాధవరావు, పసలపూడి గ్రామశాక అధ్యక్షులు మల్లిడి సూర్రెడ్డి, పధాన కార్యదర్శి అనసూరి శ్రీను, మాజీ ఎంపిటిసి నల్లమిల్లి వెంకన్నబాబు, తదితర్లు పాల్గొన్నారు.

# మురళీ నాయక్ కుటుంబానికి 50 లక్షల చెక్కు ఇంటి పట్టా పంపిణీ

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- 5 ఎకరాలు, 6 సెంట్ల స్థలం పట్టాలు కూడా...
- గోరంట్ల, సత్యసాయి జిల్లా కేంద్రంలో మురళీ కాంస్యం విగ్రహాల ఏర్పాటు
- వీర సైనికుడి ఇంటి నుంచి ఘాట్ వరకూ రూ.16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం : మంత్రి సవిత







**అంకుశం న్యూస్ పెనుకొండ జూన్ 17:** దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాను మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ లో భాగంగా వీర మరణం పొందిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీ నాయక్ తల్లీతండ్రులను మంత్రి సవిత మంగళవారం పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 50 లక్షల చెక్కును, అయిదెకరాల స్థలాన్ని, ఆరు సెంట్ల ఇళ్ల స్థలం పట్టాలను మురళీ నాయక్ తల్లిదండ్రులకు మంత్రి సవిత అందజేశారు. భరతమాత ముద్దు బిడ్డ మురళీ నాయక్ అని కొనియాడారు. దేశ ప్రజలందరి గుండెల్లో మురళీ నాయక్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దేశ ప్రజలతో పాటు కూటమి ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని వీర జవాను తల్లిదండ్రులను ఓదార్చారు. ఏ కష్టం వచ్చినా తనను సంప్రదిస్తే వెన్నుదన్నుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకుముందు కల్లితండాలోని మురళీ నాయక్ ఘాటు వద్దకెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడారు. మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. త్వరలోనే మురళీ నాయక్ నివాసం నుంచి ఘాటు వరకూ రూ. 16 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. గోరంట్లతో పాటు జిల్లా కేంద్రంలో కూడా మురళీ నాయక్ కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బదిలీ పై మాష్టారు బాధపడుతున్న స్టూడెంట్స్

పిల్లలతో అనుభందం పెంచుకున్న మాష్టారు శ్రీధర్



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 17:** మండపేట నియోజకవర్గం మండపేటలో ప్రయివేటు పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను నిర్వహిస్తారనే మంచి పేరు సంపాదించుకున్న చుట్టూరి వెంకట శ్రీధర్ మాస్టర్ మండపేట సంఘం బడి నుండి బదిలీపై వల్లూరు వెళ్ళారు. శ్రీధర్ మాస్టర్ తో ఆ విద్యార్థులకు ఉన్న అనుబంధం మాములుది కాదు. ఎనిమిదేళ్లుగా ఎందరో విద్యార్థులతో తండ్రీ బిడ్డలు లాంటి అనుబంధంతో ముందుకెళ్లిన వ్యక్తిత్వం ఆయన సొంతం. ఇంటింటికి వెళ్లి స్కూల్ కోసం ప్రచారం చేసినా, ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల కోసం సొంత ఖర్చులతో పోస్టర్ లు ముద్రించినా, పండుగ ఏదైనా కానీ దాని కోసం విపులంగా విద్యార్థులకు తెలియజేసి సొంత ఖర్చులతో వారిని పండుగ వేడుకల్లో భాగస్వాములను చేసినా ఇవన్నీ ఆ స్కూల్ లోని శ్రీధర్ మాస్టర్ కు మర్చిపోలేని మధుర జ్ఞాపకాలు అని చెప్పుకోవచ్చు. ఏ విద్యార్థి అయినా బడికి రాకపోతే ఈయన వారి ఇంటికి స్కూటీ పై వెళ్ళి తల్లిదండ్రులకు విద్యార్థులకు నచ్చజెప్పి స్కూలు కి తీసుకువెళ్లేవారు. గత ఎనిమిదేళ్ళ గా స్కూల్ ఉన్నతి కోసం విద్యార్థుల కోసం సహచర ఉపాధ్యాయుల సహకారంతో శ్రీధర్ మాస్టర్ ఎంతో చేశారు. నేడు ఆయనకు బదిలీ కావడంతో విద్యార్థులు తీవ్ర విచారంలో మునిగిపోయారు. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో చిరు సన్మానం తో ఆయనకు ప్రేమ పూర్వక వీడ్కోలు పలికారు. స్కూల్ ను వదిలి వెళ్ళే క్రమంలో శ్రీధర్ మాస్టర్ కళ్ళు చెమర్చాయి. ఓ మంచి ఉపాధ్యాయునికి విద్యార్థులంతా ఆత్మీయ వీడ్కోలు పలికారు.

## జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం

## అన్న పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ తోట



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 17:** మండపేట విజయలక్ష్మి నగర్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన పథకాలు ఎందుకు కొనసాగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సభ్యులు ప్రశ్నించారు. రాష్ట్రంలో జగన్ హయాంలో నిరుపేదలు ఎంతో ఆనందంగా ఉండేవారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చిన తరువాత గత ఏడాదిగా నిరుపేదలు సంక్షేమ ఫలాలు అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారనీ ఆరోపించారు. పథకాలు కొనసాగితే మరో శ్రీలంకల రాష్ట్రం అవుతుందని గ్లోబల్ ప్రచారం చేసిన కూటమి నేతలు ప్రస్తుతం వాటిని ఎందుకు పేర్లు మార్చి అనుసరిస్తున్నారనీ నిలదీశారు. జగన్మోహన్ రెడ్డి అవలంబించిన విధానాలు అవలంబిస్తున్నారని ఎద్దవా చేశారు. జగన్ పథకాలు లేకపోతే కూటమి ప్రభుత్వంకి అధోగతి పడుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో ఆయనంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం అన్న పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేసిన అరాచకాలు దుర్మార్గాలను ఆయన వివరించారు. రాష్ట్రంలో 766 మంది వైసీపీ నాయకులు కార్యకర్తలపై అత్యాయత్నాలు జరిగాయన్నారు. 390 మంది వైసీపీ కార్యకర్తలను కూటమి ప్రభుత్వం హత్య చేయించిందన్నారు. 203 మంది మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు జరిగాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా కూటమి ప్రభుత్వం లోకేష్ రాజ్యాంగం, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తుందని మండిపడ్డారు. వైసిపి వీటిని ప్రతిఘటిస్తుందన్నారు. వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలపై 2466 అక్రమ కేసులు బనాయించి 500 మందిని జైలులో పెట్టారన్నారు. 249 సోషల్ మీడియా యాక్టివిస్టులపై 729 అక్రమ కేసులు పెట్టి వారిలో 79 మందిని జైలుకు పంపారన్నారు. పాత్రికేయులను కూడా కూటమి ప్రభుత్వం వదల్లేదన్నారు. 11 మంది పాత్రికేయులపై భౌతిక దాడులు జరిగాయని అవేదన వ్యక్తం చేశారు. 63 మంది పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టి 8 మందిని జైల్లో పెట్టారన్నారు. నాలిక మందం తమకే ఉందని నాలిక మొద్దు మారిపోయి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారన్నారు. నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పని చేసిన బాబు ఏనాడైనా నిరుపేదల సంక్షేమానికి కృషి చేశారా అంటూ ప్రశ్నించారు. ఏ ఒక్క పథకమైన ఉచితంగా పేదలకు అమలు చేశారా అని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మండపేట పుర పాలక సంఘం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, కర్రి పాపారాయుడు, ఎంపీపీలు నౌడు వెంకటరమణ, ఉండమట్ల శ్రీనివాసు, విప్పు పోతంశెట్టి ప్రసాద్, టౌన్ పార్టీ ప్రెసిడెంట్ ముమ్మిడివరపు బాపిరాజు, పిల్ల వీరబాబు, సిరిపురం శ్రీనివాస్, కుడిపూడి రాంబాబు, దూల వెంకన్న బాబు, మందపల్లి రవి, అయ్యప్ప గుంట అయ్యప్ప, మెండు భవాని, మారి శెట్టి సత్యనారాయణ, యారామటి వెంకన్న బాబు, సలాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను వెంటనే ఇవ్వండి.

– జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి – జూన్,17:–** శ్రీ సత్య సాయి జిల్లాలోనిఅన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి జాబితాను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే బూత్ లెవెల్ ఏజెంట్లను గుర్తించి, నియమించుకొని జాబితాను ఇవ్వాలని అన్నారు. ముఖ్యంగా నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు సంబంధిత బూత్ లో ఓటు హక్కు కలిగి ఉండి, ప్రభుత్వ ఉద్యోగిగా ఉండాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా సంబంధిత భూత్ నందు ఓటు హక్కు కలిగి ఉండాలని అన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులతో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వాసుదేవ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శాఖమూరి సుగుణ మరణం పట్ల ప్రగాఢ సంతాపం.

– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.



**అంకుశం న్యూస్ విజయవాడ జూన్ 17:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సిపిఐ, మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు శ్రీమతి శాఖమూరి సుగుణ మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఎస్ వి ఎన్ ప్రసాద్ గారి సతీమణి సుగుణ మరణం బాధాకరం. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో రజాకార్ల దురాగతాలకు ఎదురొడ్డి నిలిచిన ఘన చరిత్ర కలిగిన కుటుంబం ఎస్ వి ఎన్ ప్రసాద్, సుగుణలది. వారు తుదికంటా కమ్యూనిస్టు భావాల పట్ల అంకితభావంతో ఉండటం ఆదర్శనీయం. సిపిఐ, మహిళా సమాఖ్య నాయకురాలుగా అటు పార్టీకి, ఇటు మహిళా సమాఖ్యకు సుగుణ అందించిన సేవలు ఎనలేనివి. శాఖమూరి సుగుణ మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నాను.

## మంత్రి ఇలాఖా లో విద్యుత్ కోత......ధర్మవరం చేనేత విల విల

– లయన్ పల్లెం వేణుగోపాల్



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 17:** ధర్మవరం పట్టు చేనేత పరిశ్రమ నిలయం అయితే చేనేత చీరలకు నిలయం అయిన నేసే పేటలో మిగతా చోట్ల విద్యుత్ కోత తో విల విల లాడుతున్నారని రాష్ట్రవైద్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ నియోజకవర్గం ధర్మవరం అయినప్పటికీ ఇక్కడ విద్యుత్ కోత ఎక్కువగా ఉంటుందని ధర్మవరం చేనేత పరిశ్రమకు చెందిన పల్లెం వేణుగోపాల్ విద్యుత్ శాఖ నిర్లక్ష్య వైఖరి పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత మగ్గాలు నేత నేసేందుకు విద్యుత్ కోత ఒక అడ్డంగా ఉందని ఆయన విమర్శించారు. ఈ విషయం పై మంత్రి సత్య కుమార్ కు గతంలో పదే పదే తెలియజేయడం జరిగిందన్నారు. కరెంట్ ఎందుకు పోయింది అని ఫోన్ చేస్తే విద్యుత్ శాఖ వారు సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. ధర్మవరం చేనేత కు విద్యుత్ కోత లేకుండా చేయాలని అన్నారు.

## “బీజేపీ - వారధి” కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు స్వీకరిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి.



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 17:** విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న “బి.జె.పి – వారధి” కార్యక్రమంలో భాగంగా సమస్యలపై ప్రజల నుండి పిర్యాదులు స్వీకరిస్తున్న వారిలో అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,వారధి కార్యక్రమం ఇంచార్జ్ కిలారి దిలీప్,బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ ఉన్నారు.

## తల్లికివందనం అందని వారు దిగులు పడకండి సచివాలయంలో గ్రివెన్స్ పెట్టుకోవచ్చు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 17:** తూర్పు గోదావరిజిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండల ఎంపిడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం ఫథకం చాలామంది లబ్ధిదారులుకు లబ్ది చెకూరందిని, ఇంకా అర్హతలు ఉండి నగదు అకౌంట్లులో జమ కాకపోతే సచివాలయంలో వెల్ఫేఫేర్ అసిస్టెంట్లు దగ్గర జాబితా ఉంటుందని అందులో చేక్ చేసుకుని డిఏ లాగిన్ ఎమ్ డి ఎమ్ ద్వారా గ్రీవెన్ (అర్జీ)పెట్టుకోవచ్చుని తద్వారా అర్హతలు ఉంటే పథకం ఖచ్చితంగా వస్తుందని, ఇంక ఎవరికైన అన్ని ప్రభుత్వం పెట్చిన అన్ని అర్హతలు ఉండి పథకం రాకపోతే సచివాలయాలులో గ్రివెన్స్ పెట్టుకోవడం ద్వారా లబ్ది పొందవచ్చుని ఆయన తెలియజేసారు.